క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కె.వి. బుడమేరు కట్ట ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అయోధ్య నగర్ ఒకటి నుంచి ఏడో రోడ్డు వరకు, చింతచెట్లు బజార్, ఘట్టా రత్తయ్య వీధి, అయోధ్యనగర్ డొంక రోడ్డు, సాయిబాబాగుడి రోడ్డు, అగ్రిగోల్డ్ శివాలయం వీధి, గన్నాబత్తుల బాబురావు వీధి, పసుపులేటి వారి వీధి, రామదాసు ఆది నారాయణ వీధి, సూర్యబాల అపార్ట్‌మెంట్ రోడ్డు, బుడమేరు కట్ట ఏరియా, సూరిబాబు కాలనీ, శారదా స్కూల్ ఏరియా, క్షత్రియ భవన్ ఏరియా, రామలింగేశ్వరపేట రెండో లైను తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

దాసాంజనేయ ఆలయ హుండీ ఆదాయం రూ.12.11 లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.12 లక్షల 11 వేల 729 నగదు, 75 యూఎస్ డాలర్ల ఆదాయం లభించింది. మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ, కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో లెక్కింపులో పాల్గొన్నారు. 112 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఇన్‌స్పెక్టర్ అనురాధ తెలిపారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు బండి నాగజ్యోతి, కోలా సురాంబ, యక్కల మారుతి, ప్రత్యేక ఆహ్వానితులు పోలుకొండ శ్రీనివాసరావు, సేవ సభ్యులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 8 మంది విద్యార్థుల ఎంపిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): గత నెలలో అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో తమ కళాశాల విద్యార్థులు 8 మంది ఎంపికయ్యారని ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. ఎంవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏడుకొండలు మాట్లాడుతూ.. విద్యార్థులకు సదరు కంపెనీ ఏడాదికి రూ.2 లక్షలకు పైగా వేతనం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం విభాగాధిపతి డాక్టర్ పి.బాలకృష్ణ, ఏ ముత్తవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగూరులో ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన

పెనమలూరు: గంగూరు గ్రామంలో బుధవారం అధికారులు విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఈ నెల 26వ తేదీన గంగూరు గ్రామం పర్యటించే అవకాశం ఉందని సమాచారం రావటంతో మండల అధికారులు ఏర్పాట్లకు రంగంలోకి దిగారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వీటి ద్వారా అందిస్తున్న సేవలను గవర్నర్ పరిశీలించనున్నారు. ఎంపీడీఓ సునీతాశర్మ మాట్లాడుతూ గవర్నర్ వస్తారని సమాచారం వచ్చిందని ఏతేదీన వచ్చేది తెలియాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో పర్యటన వివరాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో నాంచారరావు, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సేవలు మరింత చేరువ

- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత
- లబ్ధిదారులకు సర్టిఫికెట్ల అందజేత



జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వర్యులు, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 63వ డివిజన్ 273, 276 సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గతో కలిసి ఆమె పాల్గొన్నారు.

క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి..

అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు నూరు శాతం పరిష్కారమయ్యే దిశగా జగనన్న సురక్ష క్యాంప్‌లను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోందన్నారు. జగనన్న సురక్ష క్యాంప్ లక్ష్యాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంపై స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక దృష్టి సారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు రాబడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో నిత్యం జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిని సంక్షేమ పథకాలతో సీఎం జగనన్న ఆదుకుంటుంటే, నియోజకవర్గ ప్రజల అవసరాలను ఎమ్మెల్యే విష్ణు తీరుస్తున్నారని మంత్రి వనిత అన్నారు. అటువంటి నాయకుడిని మరోసారి తిరుగులేని మెజార్టీతో గెలిపించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

2,169 సర్టిఫికెట్ల అందజేత

ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రజా వినతులను సత్వరం పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం వంటి ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం అమలు చేస్తోందన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అప్పటికప్పుడే 11 రకాల సేవలు పూర్తి ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. 63వ డివిజన్‌లో 969 మందికి కుల, 927 మందికి ఆదాయ, 31 మందికి బియ్యం కార్డులు, ముగ్గురికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 2,169 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశామన్నారు. జగనన్న సురక్ష ద్వారా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌యూసీడీ శకుంతల, నార్త్ ఎమ్మార్వో మాధురి, అసిస్టెంట్ కమిషనర్ -2 అనసూయ, కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమంలో నూతన ఒరవడి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమంలో నూతన ఒరవడి, నవరత్నాలతో నూతన శకం నెలకొల్పారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ 244 వ వార్డు సచివాలయ పరిధి అజిత్ సింగ్‌నగర్‌లో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక, అవినీతిరహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఏపీలో అమలవుతున్న బృహత్తర కార్యక్రమాలు దేశంలోని ఏ ఒక్క రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు.

రూ.28 లక్షలతో ఉద్యానవనం అభివృద్ధి

ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు రూ.28 లక్షల వ్యయంతో రాఘవాచారి పార్కును అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఉద్యానవనాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. వాకింగ్ ట్రాక్, చిన్నారులకు ఆట వస్తువులు, పచ్చని గార్డెనింగ్‌తో పార్కు కొత్త రూపును సంతరించుకుందన్నారు. కాలనీవాసులందరూ కమిటీగా ఏర్పడి పార్కు సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

నవరత్నాలతో పేదరికం తగ్గుముఖం

పేదరిక నిర్మూలన కోసం నవరత్నాల ద్వారా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన 'జాతీయ బహుముఖ పేదరిక సూచీ' నివేదికే ఇందుకు నిదర్శనమన్నారు. 2016 కంటే 2021 నాటికి రాష్ట్రంలో నిరుపేదలు దాదాపుగా సగం వరకు తగ్గారని.. నీతిఆయోగ్ సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని చెప్పారు. తెలుగుదేశం హయాంలో రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు.. ఇలా ఏ ఒక్క వర్గాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని విష్ణు విమర్శించారు. పైగా అన్ని రంగాల్లో బకాయిలు పెట్టి.. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. 2014-19 మధ్య పొత్తులో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన సాధించి విజయాలేమైనా ఉంటే ప్రజలకు వివరించాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. ఐదేళ్ల పాటు కేంద్రంలోని బీజేపీతో అధికారాన్ని పంచుకుని కూడా పోలవరాన్ని పూర్తిచేయలేకపోయారని విమర్శించారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగనన్న ప్రభుత్వానికి రాష్ట్రంలోని ఏ ఒక్క రాజకీయ పార్టీ సాటి రాదన్నారు. సీడీవో జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కాల్వల ప్రక్షాళనకు వీఎంసీ ట్రయల్ రన్





నగరంలోని ఏలూరు, బందరు, రైవస్ కాల్వల్లోని వ్యర్థాలను తొలగించేందుకు వీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. దీనిలో భాగంగా కాలువల్లో ఎప్పటికప్పుడు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు పడవలను సిద్ధం చేసింది. మున్సిపల్ కార్మికుల సాయంతో వీఎంసీ అధికారులు బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ పడవలను త్వరలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జేఈఈ మెయిన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు పట్టుదలతో పాటుగా ప్రణాళిక ప్రకారం చదివితే ఏ పోటీ పరీక్షల్లోనైనా విజయాలు సొంతం చేసుకోవచ్చని సిద్ధార్థ అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు చెప్పారు. సిద్ధార్థ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం కళాశాల ఆవరణలో ఉచితంగా అందజేశారు. సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ఎల్‌కె. మోహనరావు, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆర్టీఏ నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ వాహనాలను నడపాలని ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆటోడ్రైవర్లను ఆదేశించారు. నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఉత్తర్వుల ప్రకారం డీసీపీ విశాల్‌గున్ని, ఏసీపీ సీహెచ్ రవికాంత్‌ల ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు గాంధీ నగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆటో డ్రైవర్లు డ్యూటీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. ముఖ్యంగా డ్రైవర్లు ఆటో నడిపేటప్పుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆటో రికార్డులు కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, ఎవరైనా ప్రయాణికులు తమ లగేజీలను ఆటోలో మర్చిపోతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినప్పుడు వారి సమాచారం పోలీసులకు అందించాలని చెప్పారు.

కొరియర్ సంస్థల నిర్వాహకులతో..

ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో అనుమానిత పార్సిళ్లపై నగరంలోని కొరియర్ సంస్థల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న పార్సిల్స్‌పై కొరియర్ సంస్థల నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పార్సిల్ బుక్ చేసేటప్పుడు, తీసుకునే సమయంలో ఆ వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేయడం ముఖ్యమన్నారు. పార్సిళ్లలో ఏమీ ఉన్నాయో కూడా కచ్చితంగా తెలుసుకోవాలని చెప్పారు. ఏదైనా అనుమానిత పార్సిళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐలు షరీఫ్, దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న సురక్ష సర్వే



క్యాలెండర్లు అందజేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి

పాయకాపురం(విజయవాడరూరల్): నియోజకవర్గంలోని 62, 64వ డివిజన్లలో జగనన్న సురక్ష సర్వేను బుధవారం ముమ్మరంగా చేపట్టారు. 270 సచివాలయ పరిధిలో వలంటీర్లతో పాటు ఇంటింటికీ వెళ్లిన అలంపూరు విజయలక్ష్మి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న 11 రకాల సర్టిఫికెట్లు అవసరం ఉన్న వారు వలంటీర్లకు సంబంధిత పత్రాలను అందజేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల క్యాలెండర్లను అందించారు కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు వేము హైమావతి, సుభాని, సాంబయ్య, నాయకులు రామిరెడ్డి, చీకటి సుబ్బయ్య, అడ్మిన్, వలంటీర్లు పాల్గొన్నారు.

64వ డివిజన్‌లో

64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, బర్మా కాలనీల్లో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ధ్రువీకరణ పత్రాల కోసం వలంటీర్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు, వలంటీర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగలక్ష్మి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని కార్పొరేటర్ తిరుపతమ్మ అందజేశారు. నాయకులు షేక్ ఇస్మాయిల్, మేడా రమేష్, వెంకటేశ్వరమ్మ, అక్కిశెట్టి నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



63వ డివిజన్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన ఉద్యానవనాన్ని, ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

విజయవాడ సెంట్రల్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన హోంమంత్రి వనిత

మధురానగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని, వచ్చే ఎన్నికలలో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావటం తథ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, హోంమంత్రి తానేటి వనిత అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను బుధవారం ఆమె స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ప్రారంభించారు. హోంమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నగరం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పవన్ కల్యాణ్ ఎప్పుడు ఏం మాట్లాడతాడో అతనికే తెలియదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై విమర్శలు చేయటం తప్ప వారు అధికారంలోకి వస్తే ఏంచేస్తారో మాత్రం చెప్పటం లేదని ధ్వజమెత్తారు. పాదయాత్రలు, బస్సుయాత్రలు, వారాహి యాత్రలు వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేవని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ సీఎం జగన్ సహకారంతో సెంట్రల్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతరం 32వ డివిజన్ అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్ -1లో రూ.కోటి 52 లక్షల వ్యయంతో పూర్తిచేసిన రోడ్లు, 30వ డివిజన్ దేవీ నగర్‌లో రూ.కోటీ 5లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం, 61వ డివిజన్ పాయకాపురంలో రూ.3.71 కోట్లతో పునరుద్ధరించిన చెరువు, 64వ డివిజన్‌లో రూ.19.23 లక్షలతో అభివృద్ధి చేసిన త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, 63వ డివిజన్ ఉడా కాలనీలో రూ.75 లక్షలతో నిర్మించిన ఉద్యానవనాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, దుర్గ, కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మ, బి.జానారెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి, నాయకులు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్యనభ్యసిస్తే విజయం తథ్యం



సదస్సులో ప్రసంగిస్తున్న నాగేశ్వరరావు, వేదికపై తేజోవతి, జగదీష్, శ్రీధర్ తదితరులు

విజయవాడ కల్చరల్: విద్యార్థులు ప్రణాళిక, సంకల్పం, పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యమని యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా శాఖల ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని శారదా కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అంశంగా అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్య సాధనే ధ్యేయంగా చిత్తశుద్ధి, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. అధ్యాపకులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు తేజోవతి, జగదీష్‌లు మాట్లాడుతూ.. ధృడమైన మనస్సు, మంచి స్నేహితులు, మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అవగాహన సదస్సులో కళాశాల కరస్పాండెంట్ ఎస్ఎస్ వరప్రసాద్, ఇంటర్మీడియెట్ విభాగం ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్లెల రోజేష్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలకు నిపుణులు పరిష్కారాలు చెప్పారు.

ఖోఖో సంఘ సమావేశం వాయిదా

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 30వ తేదీన జరగాల్సిన ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ సంఘ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కృష్ణాజిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరంలోని రోటరీ హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తామని ఇటీవల ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాలతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రసాద్ వెల్లడించారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సచివాలయాల్లోని మహిళా పోలీసులు సమాజంలో మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజయవాడ వెస్ట్ ఏసీపీ కె.హనుమంతరావు ఆదేశించారు. వెస్ట్ డివిజన్ పరిధిలోని వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ల పరిధిల్లోని వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులతో రాయల్ కన్వెన్షన్‌లో బుధవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ.. ఆయా సచివాలయాల పరిధిల్లో పని చేస్తున్న మహిళా పోలీసులు మహిళా సమస్యలను గుర్తించాలన్నారు. వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతే కాకుండా మహిళల వివాదాలకు సంబంధించి మహిళా పోలీసుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను, అందులో మహిళా పోలీసులను ఏర్పాటు చేసిందన్నారు. మహిళా సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మహిళా పోలీసులు ప్రభుత్వం లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. సీఐలు సురేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన మోకా రాజ్‌కుమార్ బోరు పనులు చేస్తాడు. అతను మంగళవారం పనికి వెళ్లలేదు. రాత్రి పెనమలూరు సెంటర్‌లో మద్యం దుకాణానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలవటంతో అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.